క్లుప్తంగా

గోకులం షెడ్ల నిర్మాణాల పరిశీలన



గోకులం షెడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

బొండపల్లి: గొట్లాం గ్రామంలో ఉపాధి నిధులతో నిర్మిస్తున్న గోకులం షెడ్లతో పాటు,పంట కాలువల్లో వేతనదారులు చేపడుతున్న తుప్పలు,పూడికతీత పనులను ఎంపీడీఓ జి.గిరిబాల శనివారం పరిశీలించారు. నిబంధనల మేరకు గోకులం షెడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. ఎంపీడీఓ వెంట ఉపాధి హామీ ఏపీఓ బి.కృష్ణవేణి తదితరులున్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



లైబ్రేరియన్‌కు పుస్తకాలు, ప్లాంక్‌లు అందజేస్తున్న దాతలు

గజపతినగరం: స్థానిక శాఖా గ్రంథాలయానికి మండల కేంద్రానికి చెందిన కందుల చిన్నయ్యస్వామి, కె.గురుమూర్తి(మీసేవ నిర్వాహకుడు) సుమారు రూ.15వేల విలువైన పుస్తకాలను శనివారం అందజేశారు. గ్రంథాలయంలో డీఎస్సీ, గ్రూప్స్, ఎస్ఐ, కానిస్టేబుల్, బ్యాంకు, ఆర్ఆర్‌బీ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం సంబంధిత పుస్తకాలతో పాటు, 15 పెద్ద ప్లాంక్‌లను దాతలు సమకూర్చారని లైబ్రేరియన్ వై.స్వప్న చెప్పారు. దాతలకు లైబ్రేరియన్, పాఠకులు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు విశ్రాంత ఉపాధ్యాయుడు తవ్వా అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



ఎంపీడీఓ రామకృష్ణరాజును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. చీపురుపల్లి ఎంపీడీఓగా విధులు నిర్వర్తించి ఇటీవల నెల్లిమర్ల బదిలీ అయిన కె.రామకృష్ణరాజుతో పాటు ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సన్మానించారు. వైస్ ఎంపీపీ కరిమజ్జి రమణమ్మ, ఈఓపీఆర్డీ ఐ.సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీను, ఇప్పిలి గోవింద, రేవల్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 8న మాలల గర్జన



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ డిసెంబర్–8న విశాఖపట్నంలో నిర్వహించనున్న ఉత్తరాంధ్ర మాలల గర్జనను విజయవంతం చేయా లని చీపురుపల్లి నియోజకవర్గ మాలల సంఘం కన్వీనర్ బొంపల సంజీవరావు, మాలమహానాడు నాయకులు కోరారు. సంబంధిత వాల్‌పోస్టర్లను గరివిడి ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లా డుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల గళం వినిపించేందుకు నిర్వహించనున్న చలో విశాఖ, ఉత్తరాంధ్ర మాలల గర్జన కార్యక్రమానికి నియోజకవర్గంలోని మాలలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు నాయకులు పి.చంద్రరావు, బూర సూర్యనారాయణ, బోడసింగి పోలీస్ ,లోపింటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యసేవల పరిశీలన



గర్భిణులకు చేస్తున్న రక్త పరీక్షలను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

బొండపల్లి: అంబటివలస గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో అందిస్తున్న వైద్యసేవలను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం శనివారం పరిశీలించింది. వైద్య సిబ్బంది గర్భిణులకు నిర్వహించిన రక్త పరీక్షలను, రికార్డులను టాస్క్‌ఫోర్స్ అధికారి ధర్మారావు, డీపీఎం రామానుజులునాయుడు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన జాబ్‌చార్ట్ ప్రకారం వైద్య సేవలందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఎ.బాషా, హెల్త్‌ఎడ్యుకేటర్ బి.విశ్వేశ్వరరావు, తదితరులు వారి వెంట ఉన్నారు.

బతుకు బాట.. మెతుకు వేట

- బతుకు తెరువు కోసం రాజస్థాన్ నుంచి వలసలు
- వ్యవసాయ పరికరాలు తయారు చేసి, విక్రయిస్తూ కుటుంబ పోషణ



నిప్పుల కొలిమిలో ఇనుమును కరిగిస్తున్న మహిళలు



కంతపేటలో రైతులకు అద్దెకు ఇచ్చేందుకు తెలంగాణ వాసులు సిద్ధం చేసిన టార్పాలిన్‌లు



ఎల్.కోట మండలంలోని జమ్మాదేవిపేట జంక్షన్‌లో వ్యవసాయ పనిముట్ల తయారీ పనిలో రాజస్థాన్ వాసులు

లక్కవరపుకోట:

ఉన్న ఊరిలో ఉపాధి కరువై..పొట్టకూటి కోసం, బతుకు బండిని లాగేందుకు వందల కిలోమీటర్లు దాటి రాజస్థాన్ నుంచి కుటుంబాలతో సహా ఈ ప్రాంతానికి వచ్చి ఎన్నో ఆశల మధ్య జీవనం సాగిస్తున్నారు వలసజీవులు. కష్టపడే వారికి భాష, ప్రాంతంతో సంబంధం లేదని, చెమట చిందిస్తేనే నాలుగు వేళ్లూ నోట్లోకి వెళతాయని శ్రమనే నమ్ముకుని వలస వచ్చి వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ ముందుకు సాగుతున్నారు. పాత ఇనుమును తక్కు వ ధరకు కొనగోలు చేసి వాటిని నిప్పుల కొలిమిలో కరిగించి, రెక్కలు ముక్కలు చేసుకుంటూ వ్యవసాయ పనిముట్లు, ఇతర పరికరాలుగా మార్చి వాటిని విక్రయించుకుంటూ బతుకు బండిని ఈడుస్తున్నారు. ఈ పనిలో పురుషులతో సమానంగా మహిళలు సమ్మెట పట్టు కుని రోజంతా కష్టపడుతున్నారు. ఏటా నవంబర్ నెలాఖరు, డిసెంబర్ ప్రారంభంలో రాజస్థాన్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వందల కుటుంబాలు విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు వలసవచ్చి గ్రామాల్లో గుడారాలు వేసుకుని వ్యవసాయ పనిముట్లు, ఇతర పరికరాలు తయారు చేసి విక్రయిస్తుంటారు. ఫిబ్రవరి మొదటి వారంలో తమసొంత ప్రాంతానికి తిరుగు ప్రయాణమవుతుంటారు. ప్రస్తుతం ఎస్.కోట నియోజకవర్గంలో ని పలుగ్రామాలు, ప్రధాన జంక్షన్‌లలో గుడారాలు వేసుకుని పనులు చేస్తున్నారు. రైతులు తమకు కావాల్సిన రీతిలో కత్తులు, పారలు, గొడ్డళ్లు, కొడవళ్లు, గునపాలు, ఇతర పనిముట్లు చేయించుకుంటున్నారు.

టార్పాలిన్‌లు అద్దెకు ఇస్తూ..

వరి పంట కోతలు ప్రారంభం కావడంతో వరి నూర్పులు చేసేందుకు రైతులకు టార్పాలిన్‌లు అవసరం. తెలంగాణ,నెల్లూరు ప్రాంతాలకు చెందిన పలువురు పెద్ద ఎత్తున టార్పాలిన్‌లు పట్టుకొని ఈ ప్రాంతానికి వలస వచ్చారు. ప్రధాన జంక్షన్‌లలో గుడారాలు వేసుకుని అక్కడే టార్పాలిన్‌లను నెట్టులు వేసి రైతులకు అద్దెకు ఇస్తున్నారు. గతంలో వరి పంట నూర్పు చేయాలి అంటే ముందుగా కళ్లాలను పశువుల పేడతో శుభ్రంగా అలకాలి.ఇందుకోసం అయిదుగురు నుంచి ఎనిమిది మంది వరకు పని చేయాలి. ప్రస్తుతం టార్పాలిన్‌లు అద్దెకు విస్తృతంగా లభిస్తుండడంతో రైతులు కళ్లాలతో పనిలేకుండా ఎక్కడ కావాలి అంటే అక్కడే టార్పాలిన్‌లు వేసి ట్రాక్టర్లతో సులువుగా నూర్పులు చేస్తున్నారు. 10 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు ఉన్న టార్పాలిన్‌కు రోజుకు రూ.20కు అద్దె వసూలు చేస్తున్నారు.

మండల పరిషత్‌ల బడ్జెట్ ఆమోదం



గంట్యాడ: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: మండల పరిషత్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన శనివారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. రూ.198.69 కోట్ల అంచనా బడ్జెట్ కు ఎంపీటీసీ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కిలపర్తి వెంకటలక్ష్మి, ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, ఈఓపీఆర్డీ భానోజీరా వు, పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ

చీపురుపల్లిలో..

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అధ్యక్షతన 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్ సమావేశం శనివారం నిర్వహించారు. రూ.106.57 కోట్లతో సిద్ధం చేసిన అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. ఈ సంద ర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి, ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు బడ్జెట్ సిద్ధం చేశారని చెప్పారు. జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైస్ ఎంపీపీ కరిమజ్జి రమణమ్మ,ఎంపీడీఓ ఏ.స రళ, ఈఓపీఆర్డీ ఐ.సురేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు



వేపాడ: మారికలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

వేపాడ: మండలంలోని గిరిశిఖర గ్రామం మారికలో వేపాడ పీహెచ్‌సీ సిబ్బంది శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. 92 మందికి వివిధ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. చిన్నారులకు ఇమ్యునైజేషన్ టీకాలు వేశారు. సర్పంచ్ పాతబోయిన ఎర్రయ్యమ్మ శిబిరాన్ని సందర్శించారు. హెల్త్‌సూపర్‌వైజర్ వి.వి.రమణ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్ పీలు సేవలందించారు.



గజపతినగరం: పిడిశీలలో సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ, సిబ్బంది

పిడిశీలలో..

గజపతినగరం: మండలంలోని పిడిశీల గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో శనివారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. 47 మందికి వైద్యాధికారి వివిధ వైద్యపరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసి, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు.అనంతరం గృహసందర్శన చేసి శిబిరానికి రాలేని వృద్ధులు, బెడ్ రెస్ట్ రోగులకు వైద్యసేవలందించారు.

తక్షణమే వేతన ఒప్పందం అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

చీపురుపల్లి: కార్మికుల సమస్య తెలుసుకుని యాజమాన్యం తక్షణమే వేతన ఒప్పందం అమలు చేయాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఏ.గౌరునాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని కర్లాం జంక్షన్ వద్ద ఉన్న వెంకటరామ పాలిట్రీస్ పరిశ్రమ ఎదుట వర్కర్స్ యూనియన్‌తో కలిసి శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు 2024 జూన్‌లో వేతన ఒప్పందం అమలు చేయాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తోందన్నారు. యాజమాన్యంతో పాటు కార్మిక శాఖ వద్ద చర్చలు జరుగుతున్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. యాజమాన్యం వేతన ఒప్పందం అమలు చేయకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. వెంకటరామ పాల్ట్రీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఐ.గురునాయుడు, కార్యదర్శి టి.ఈశ్వరరావు, సభ్యులు పాల్గొ న్నారు.

పాడిరైతుల రాస్తారోకో



అరకు-విశాఖ రోడ్డులో రాస్తా రోకో చేస్తున్న పాడిరైతులు

కొత్తవలస: డెయిరీలు పాల సేకరణ ధరలను పెంచాలని కోరుతూ పాడిరైతులు స్థానిక అరకు -విశాఖ జాతీయ రహదారిలో నిమ్మలపాలెం జంక్షన్‌వద్ద శనివారం రాస్తారోకో చేశారు. పాడిపశువులతో రోడ్డుపైకి వచ్చి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ పాడి రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొంప కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గాడి అప్పారావు మాట్లాడుతూ ఆవు పాలు లీటర్‌కి రూ.50, గేదె పాలు లీటర్‌కి రూ.80 పాడి రైతులకు డెయిరీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీని సహకార రంగంలోకి తీసుకొచ్చి ప్రభుత్వమే నిర్వహించాలని, పాడి రైతులకు 75 శాతం రాయితీపై దాణా అందించాలని కోరారు. పాడిరైతుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 2వ తేదీన విశాఖ డైయిరీని ముట్టడిస్తామని తెలిపారు. పాడి రైతులు బొబ్బర రాజు, చీపు రుపల్లి లక్ష్మి, చీపురుపల్లి దాలినాయుడు, గోగాడ సత్యారావు,గొంప పాతునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి డి.వి.రమణ

గంట్యాడ: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా చాలవరకు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి డి.వి.రమణ అన్నారు. మండలంలోని దిగువ కొండపర్తి గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. పాఠశాలను సందర్శించి, వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనం తినే ముందు, మల విసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. జ్వరం వచ్చి ఒకటి రెండు రోజులు అయినా తగ్గకపోతే వైద్య పరీక్షలు చేయించు కోవాలని,ఆరోగ్యంపై అలసత్వం వహించవద్దన్నా రు. హెల్త్ సూపర్ వైజర్ తిరుపతిరావు, హెచ్ఎం రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

దళారులకే ధాన్యం విక్రయం





ఈ చిత్రాలు చూశారా.. గుర్ల మండలంలో ఒక చోట విక్రయానికి రైతులు సిద్ధం చేసిన ధాన్యం కాగా.. మరో చోట దళారులు కొనుగోలు లోడ్ చేస్తున్నారు. పంట చేతికందడం, స్థానికంగా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడం.. తుఫాన్ హెచ్చరికలతో రైతులు తక్కువ ధరకే దళారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా దళారులు ధాన్యం కొనుగోలు చేసి ఉభయగోదావరి జిల్లాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు. గుర్ల, గోషాడ, గరిడ, పల్లిగండ్రేడు, పెద్దబంటుపల్లి, కెల్ల, వల్లాపురం, లవిడాం, కొండగండ్రేడు, గరికివలస, కోటగండ్రేడు గ్రామాలతో పాటు, గరివిడి మండలంలోని రేగటి , వీపీ రేగ గ్రామాల్లో ఇప్పటి వరకు 200 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి తరలించినట్టు సమాచారం.

– గుర్ల

రెండు రోజుల్లో ప్రారంభిస్తాం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. రైతులెవ్వరూ దళారులకు విక్రయించవద్దు. తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తాం.

– ఎం.శ్రీనివాసరావు, సీఎస్‌డీటీ, గరివిడి

తుఫాన్‌కు భయపడి..



వరి నూర్పు పూర్తిచేసి రెండు రోజులైంది. తుఫాన్ ఉందని అధికారులు చెప్పడంతో ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువ ధరకే అమ్ముకున్నాం.

– పొదిలాపు అప్పలనాయుడు, రైతు, గుర్ల

ఘనంగా సత్యసాయి జయంతి ఉత్సవాలు

సత్యసాయిబాబా 99వ జయంతి ఉత్సవాలను సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కొత్తవలస, చీపురుపల్లి,ఎల్.కోట, గుర్ల, గజపతి నగరం, బొండపల్లి మండలాల్లోని సత్యసాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. మందిరాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం బాబా చిత్రపటాలను పల్లకీల్లో ఉంచి ఊరేగించారు. కొత్తవలస రెల్వేస్టేషన్ వద్ద బాబా మందిరంలో పేదలకు దుప్పట్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గరివిడి పట్టణంలోని రామేశ్వర కాలనీలో సత్యసాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో దాస్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. విజయనగరం ఎన్ఆర్ఐ ఆస్పత్రి, పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది 300 మందికి సాధారణ వైద్యపరీక్షలతో పాటు నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

– కొత్తవలస/లక్కవరపుకోట/చీపురుపల్లి/గుర్ల/గజపతినగరం/బొండపల్లి/చీపురుపల్లిరూరల్(గరివిడి)



కొత్తవలస: కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలోని సత్యసాయి బాబా మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సత్యసాయి సేవా సమితి



గుర్ల: గుర్లలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, ఎంఈఓ రామారావు



గజపతినగరం: గజపతినగరంలో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు



కొత్తవలస: కొత్తవలస మూడురోడ్ల జంక్షన్‌లో సత్యసాయి పల్లకీ సేవలో పాల్గొన్న మహిళలు

రెళ్ల రాల్చు పురుగుపై అప్రమత్తంగా ఉండాలి

గజపతినగరం: వరి పంట ప్రస్తుతం కోత దశలో ఉన్నప్పటికీ రెళ్ల రాల్చు పురుగు ఆశిస్తోందని, రైతులు అప్రమత్తంగా ఉంటూ నివారణ చర్యలు చేపట్టాలని ఏఓ సీహెచ్. ధనలక్ష్మి సూచించారు. మండలంలోని లోగిశ, తుమికాపల్లి గ్రామాల్లో వరి పంటను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలస్యంగా వరి నాట్లు వేసిన చోట ఎక్కువగా రెళ్ల రాల్చు పురుగు కనిపిస్తోందని, ఈ పురుగు వరి కంకులను కొరికివేస్తుందని, పొలంలోనే ధాన్యం రాలిపోతాయని రైతులకు వివరించారు. ఈ పురుగు నివారణకు 2.5 మిల్లీ లీటర్లు క్లోరిపైరిఫాస్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని, ఎకరానికి 500 మిల్లీలీటర్ల మందును వాడాలని సూచించారు.అలాగే మోనోక్రోటోఫాస్, ఎసిఫేట్ వంటి మందులను పిచికారీ చేసుకోవచ్చని చెప్పారు. రెళ్ల రాల్చు పురుగు ఉదయం పూట వరిదిబ్బల మొదళ్లలో దాక్కొని సాయంత్రం చీకటి పడిన తర్వాత కంకుల మీదకు వచ్చి వరి రెక్కలను కత్తిరించేస్తుందని, పురుగు మందులను సాయంత్రం పూట పిచికారీ చేసుకుంటే మంచిదని చెప్పారు.ఆమె వెంట వీఏఏలు జ్యోత్స్న, ప్రమీల ఉన్నారు.

గురుకులంలో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న గురుకులాల జిల్లా కో–ఆర్డినేటర్ ఫ్లోరెన్స్

వేపాడ: బక్కునాయుడుపేట గ్రామంలోని బి.ఆర్. అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను గురుకులాల జిల్లా కో–ఆర్డినేటర్ ఫ్లోరెన్స్ శనివారం తనిఖీలు నిర్వహించారు. ఏపీఏఏఆర్ జనరేషన్, జేఎన్‌బీలో విద్యార్థినుల వివరాల నమోదుపై ఆరా తీశారు. మైక్రో టెస్ట్‌లు, వీక్లీ టెస్ట్‌ల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పదోతరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయినులు కృషి చేయాలని సూచించారు. అనంతరం, విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి ఉన్నారు.

వ్యవసాయ సహాయకులకు శిక్షణ



విత్తన శుద్ధిపై వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

శృంగవరపుకోట: ఎస్.కోట సబ్‌డివిజన్ పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులకు స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద శనివారం పలు అంశాలపై వ్యవసాయ సహా య సంచాల కురాలు ఎల్.విజయ, డీఆర్‌సీ ఏడీఏ కె.భారతి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం వరిలో రెళ్లరాల్చు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, దీని నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములను లీటరు నీటికి కలిపి, 200లీటర్లు మందు ద్రావణం ఎకరానికి పిచికారీ చేయాలని చెప్పారు. ప్రస్తుతం పురుగును నివారించక పోతే తర్వాత అపరాల సాగుపై దీని ప్రభావం పడుతుందన్నారు. అనంతరం నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్(ఎన్‌పీఎస్ఎస్) యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనకు వెళ్లినపుడు ఏదైనా పురుగు, తెగుళ్లను గమనిస్తే వాటిని ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వాటి నివారణ చర్యలను తెలియజేస్తుందన్నారు. అపరాల విత్తనాలను ట్రైకోడెర్మావిరిడితో శుద్ధి చేసే విధానాన్ని వివరించి, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అయిదు మండలాల ఏఓలు పాల్గొన్నారు.

జాతీయ ఫార్మసీ వారోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఫార్మసీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

గజపతినగరం: జాతీయ 63వ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా మండలంలోని సీతారామపురం ఫార్మసీ కళాశాల విద్యార్థులు గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. వైద్యసిబ్బంది అందిస్తున్న సేవలు, వైద్యుల గొప్పతనాన్ని వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదీప్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

మెరకముడిదాం: బైరిపురం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు సముద్రాల శ్రీధర్ ఆచార్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాత సేవ, నవనీతసేవ, దోమాలసేవ చేశారు. అనంతరం ఆలయ తిరువీధుల్లో ఉత్సవ మూర్తులను ఊరేగించారు.